క్లుప్తంగా

నేడు డయల్ యువర్ డీఎం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులు డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జీపీపీ డిపో మేనేజర్ పవన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికుల సమస్యలను పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి 11 వరకు జరిగే ఈ కార్యక్రమంలో **99592 26270** నంబరుకు ఫోన్‌చేసి సమస్యలు, సూచనలు, సలహాలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పవన్ తెలిపారు.

పారదర్శకత అవసరం



మహిళా సంఘం సభ్యులతో మాట్లాడుతున్న విద్యాసాగర్

బెజ్జంకి(సిద్దిపేట): మహిళా సంఘాల రుణాల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని సిద్దిపేట డీపీఎం విద్యాసాగర్ సూచించారు. మండలంలోని బేగంపేటలో సోమవారం మహిళా సంఘాలను విచారించారు. ఇటీవల వచ్చిన ఆరోపణలతో పాటు మిగతా గ్రూపుల నిర్వహణను పరిశీలించారు. వర్ధిని సంఘంలో వీఓ వాడుకున్న రూ.2 లక్షలను వడ్డీతో సహా చెల్లించినట్లు సభ్యులు తెలిపారు. సంఘాలకు చెందిన బ్యాంకు, స్త్రీనిధి రుణాల వివరాలను ఆడిట్ చేసి డీఆర్‌డీఓకు నివేదిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం నర్సయ్య, మాజీ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంజీవరెడ్డి, సీసీలు సారయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

216 మందికి నేత్ర పరీక్షలు



వివరాలు నమోదు చేసుకుంటున్న సిబ్బంది

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి, తోటపల్లి పీహెచ్‌సీల ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన శంకర నేత్ర వైద్యశాల సహకారంతో సోమవారం బెజ్జంకి బాలికల ఉన్నత పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 216 మందికి పరీక్షలు చేసి మందులు అందజేశారు. శస్త్రచికిత్స అవసరమైన 46 మందిని గుర్తించి హైదరాబాద్ ఆస్పత్రికి తరలించారు. కార్యక్రమంలో బెజ్జంకి, తోటపల్లి వైద్యులు మాధురి, కృష్ణతేజ, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా 108 నేషనల్ పైలెట్స్ డే



కేక్ కట్‌చేస్తున్న 108 పైలెట్స్

గజ్వేల్‌రూరల్: అత్యవసర సమయంలో క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని ఈఎంఆర్‌ఐ ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జాన్ షాహిద్ పిలుపునిచ్చారు. 108 నేషనల్ పైలెట్స్ డే సందర్భంగా సోమవారం గజ్వేల్‌లో పైలెట్స్‌తో కలిసి కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాద సమయంలో క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి వారి ప్రాణాలను కాపాడడంలో 108 పైలెట్ల పాత్ర కీలకమైందన్నారు. కార్యక్రమంలో పైలెట్లు చక్రపాణిగౌడ్, కొండల్‌రెడ్డి, నవీన్, నరేశ్, శ్రీనివాస్, రమేశ్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసెట్‌లో ప్రతిభ చూపిన విద్యార్థినులు



ర్యాంకులు సాధించిన విద్యార్థినులు రేవతి, నవ్య

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండలం వీరారెడ్డిపల్లి విద్యార్థినులు కట్లె రేవతి, పంజ నవ్య మరోసారి తమ ప్రతిభ చాటారు. గత ఏపీ ఈసెట్‌లో రాష్ట్రస్థాయిలో మొదటి, రెండో ర్యాంకులు సాధించిన వారు ఇప్పుడు టీజీ ఈసెట్ 2025 ఫలితాల్లో సైతం మొదటి, రెండో ర్యాంకులు సాధించారు. కట్లె రేవతి 200 మార్కులకు గాను 164 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు, అదే గ్రామానికి చెందిన పంజ నవ్య 200 మార్కులకు గాను 161 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. వారిని గ్రామస్తులు సోమవారం అభినందించారు.

‘పారిశుద్ధ్యం’ అస్తవ్యస్తం

రోడ్లపై నిలిచిపోతున్న నీరు

- ధ్వంసమైన డ్రైనేజీలు
- పట్టించుకోని అధికారులు
- ప్రత్యేక పాలనతో ప్రజల ఇబ్బందులు



నిర్మల్‌నగర్‌లో మురుగు కాలువల దుస్థితి

వానాకాలం ప్రారంభమైతే చాలు గ్రామాల్లో అంతర్గత రోడ్లపై నీరు నిలిచిపోయి డ్రైనేజీల నుంచి దుర్వాసన వెదజల్లుతుంది. దీంతో ఈగలు, దోమలు వృద్ధి చెంది ప్రజలు అనారోగ్య బారినపడతారు. వానాకాలం సమీపిస్తుండటంతో అధికారులు ముందస్తుగానే పారిశుద్ధ్యంపై దృష్టి సారిస్తే ప్రజలు ఇబ్బందుల నుంచి దూరమయ్యే అవకాశం ఉంటుంది.

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని మొత్తం 29 గ్రామాలు ఉన్నాయి. యేడాదిన్నరకు పైగా గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడం వల్ల ప్రత్యేక పాలన కొనసాగుతోంది. ప్రతి గ్రామానికి ప్రత్యేక అధికారిని నియమించారు. పంచాయతీలకు నిధుల కొరత మూలంగా చాలా గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ పనులు ముందుకు సాగడం లేదు. రోడ్లపై మురుగు గుంతలు ఏర్పడడం, డ్రైనేజీలు ధ్వంసమై చెత్తతో నిండిపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

పల్లపు ప్రాంతాల్లో మొరం పోయాలి

గ్రామాల్లోని వర్షం నీరు నిలిచిపోయే ప్రాంతాలను గుర్తించి ముందుగానే మొరం పోయడం, మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బురదమయం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ధ్వంసమైన డ్రైనేజీలను పునర్నిర్మించాలని కోరుతున్నారు.

చిన్నపాటి వర్షాలకే నిలిచిపోతున్న నీరు

జగదేవ్‌పూర్, తిగుల్, తిమ్మాపూర్, అనంతసాగర్, వట్టిపల్లి, చాట్లపల్లి, పీర్లపల్లి, ఇటిక్యాల, లింగారెడ్డిపల్లి, బీజీవెంకటాపూర్, మునిగడప తదితర గ్రామాల్లో అంతర్గత రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. దానికితోడు మురుగు కాల్వలు ధ్వంసమై ఆ నీరంతా రోడ్లపైకే చేరుతోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి.



తిగుల్ గ్రామంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని పారిశుద్ధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపడతాం. రోడ్లపై ఏర్పడ్డ గుంతలను పూడ్చి మరమ్మతులు చేపడతాం. అలాగే మురుగు కాలువల్లో నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకుంటాం. అన్ని గ్రామాల్లో జోన్ల విధానాన్ని ఏర్పాటు చేశాం. మేజరు సమస్యల గురించి పై అధికారులకు తెలియజేసి వారి సూచనల మేరకు చర్యలు తీసుకుంటాం.

- రాంరెడ్డి, ఎంపీడీఓ, జగదేవ్‌పూర్

టీజేఎఫ్ పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబురాల పోస్టర్‌ను ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవిష్కరించారు. క్యాంపు కార్యాలయంలో ఆయన బీఆర్‌ఎస్ నాయకులు శర్మ, భూపేశ్, సాయిరాంతో పాటు ఫోరం ప్రతినిధులతో కలిసి సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమంలో కీలకమైన పాత్ర పోషించిన టీజేఎఫ్ 25 వసంతాల సంబురాలు జరపడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫోరం జిల్లా కన్వీనర్ నాగరాజు, జర్నలిస్టు నాయకులు అశోక్, శంకర్, నవీన్, శ్రీకాంత్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో వలస కార్మికుడి మృతి

వర్గల్(గజ్వేల్): ఓవలస కార్మికుడు గుండెపోటుకు గురై నిద్రలోనే కన్నుమూశాడు. ఈ ఘటన వర్గల్ మండలం గౌరారంలో సోమవారం చోటు చేసుకుంది. గౌరారం ప్రొబేషనరీ ఎస్‌ఐ కీర్తి రాజు తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్‌కు చెందిన కావ మొద్దీన్ రాయ్(41), మనోజ్‌మహతో, మనోజ్‌కుమార్, రాజ్‌కుమార్, రాంబాబు రాయ్ గౌరారంలో అద్దె ఇంట్లో ఉంటూ సమీప కంపెనీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి వారందరూ భోజనం చేసి నిద్రపోయారు. సోమవారం ఉదయం చూసేసరికి కావమొద్దీన్‌రాయ్ మృతి చెందాడు. కంపెనీ హెచ్‌ఆర్ ప్రమోద్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. అనారోగ్యంతో నిద్రలోనే గుండెపోటుకు గురై మృతి చెంది ఉండవచ్చని చెప్పారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని ఎర్రచెరువుతో పాటు పరిసర ప్రాంతాల్లో మురుగు నీరు ప్రవహించడం వల్ల సాగుకు ఇబ్బందిగా మారుతోందని, సమస్యకు పరిష్కారం చూపించాలని డీసీసీ లీగల్ సెల్ జనరల్ సెక్రెటరీ బైరి ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక రైతులతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాడి పశువుల సంత ఆవరణలోని బిడ్డి నుంచి పట్టణంలోని మురుగు నీరు ప్రవహించి ఎర్ర చెరువు కాలువలో కలుస్తుందన్నారు. దీంతో ఆ ప్రాంత భూములు సాగుకు పనికిరాకుండా పోతున్నాయని వాపోయారు. మురుగునీటి కాలువ నిర్మించి, రైతుల కష్టాలను తీర్చాలని కోరామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

భూములపై హక్కులు కల్పించాలని వినతి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కట్కూర్ శివారులోని ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారికి పట్టా హక్కులు కల్పించాలని కోరుతూ గ్రామస్తులు వెంకట్రాది, కె.సమ్మయ్య, మల్లారెడ్డి, సత్యం, సాంబరాజు తదితరులు సోమవారం ఆర్డీఓ రామ్మూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము 26 యేళ్లుగా ఆ భూమిలో సాగు చేసుకుంటూ బతుకుతున్నామన్నారు. రైతులందరికీ పట్టా హక్కులు కల్పించాలని కోరారు.

వనిత క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పార్వతీ వర్ధిని సహిత రామలింగేశ్వరస్వామి అమావాస్య అన్న ప్రసాద వితరణ మహిళా విభాగం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి అమావాస్యకు మహిళా విభాగం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు.

సర్టిఫికెట్ల కోసం ప్రజల పడిగాపులు



తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజల పడిగాపులు

అక్కన్నపేట(హుస్నాబాద్): కుల, ఆదాయం, నివాస ధ్రువపత్రాల కోసం విద్యార్థులు, నూతన రేషన్ కార్డుల కోసం ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం అధిక సంఖ్యలో ప్రజలు పడిగాపులు పడ్డారు. అక్కన్నపేట మండలం భూభారతి చట్టం అమలు కింద పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైంది. అయితే తహసీల్దార్ కార్యాలయంలో ఒక జూనియర్ అసిస్టెంట్, ఒక అటెండర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన వారంతా హుస్నాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తున్నట్లు అధికారులు చెప్తున్నారు. దీంతో ధ్రువపత్రాలు, రేషన్ కార్డుల కోసం వచ్చిన వారికి చుక్కలు కనిపిస్తున్నాయి. ఈ సందర్భంగా పలువురు విలేకరులతో మాట్లాడుతూ కులం, ఆదాయం సర్టిఫికెట్ల కోసం నాలుగైదు రోజులుగా పనులు మానుకుని తిరుగుతున్నామన్నారు. 15 నుంచి 20 రోజుల గడుస్తున్నా సర్టిఫికెట్లు రావడంలేదని వాపోయారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టిసారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

కంట్రోలర్, వాచ్‌మన్‌ను నియమించాలి

సీపీఎం నాయకుల వినతి



డిపో ఇన్‌చార్జికి వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

దుబ్బాక: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం కంట్రోలర్, నైట్ వాచ్‌మన్‌ను నియమించాలని సీపీఎం ఆధ్వర్యంలో డిపో ఇన్‌చార్జికి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జిల్లా నాయకుడు భాస్కర్ మాట్లాడుతూ బస్టాండ్‌లో రెగ్యులర్ కంట్రోలర్‌ను యాజమాన్యం తొలగించడంతో బస్సుల వివరాలు తెలియక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అదే విధంగా రాత్రిపూట సిబ్బంది లేకపోవడంతో బస్టాండ్ ఆవరణలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాజమాన్యం వెంటనే రెగ్యులర్ కంట్రోలర్‌తో పాటు నైట్ డ్యూటీ సిబ్బందిని నియమించి బస్టాండ్ పరిసరాలను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భాస్కర్, సాజిత్, లక్ష్మీనర్సయ్య, ఎల్లం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

జిల్లా క్రీడాశాఖాధికారికి సన్మానం



వెంకట్‌నర్సయ్యను సన్మానిస్తున్న క్రీడా ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జిల్లా యువజన క్రీడలశాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌నర్సయ్యను సోమవారం పలు క్రీడా సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను డీవైఎస్‌ఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడా సంఘాల సహకారంతో జిల్లాను క్రీడల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి(వాలీబాల్), ప్రవీణ్(స్విమ్మింగ్), అక్బర్(ఫుట్‌బాల్), ఉప్పలయ్య(రెజ్లింగ్), మల్లేశం(హ్యాండ్ బాల్), శ్రవణ్(టగ్ ఆఫ్ వార్), శ్రీనివాస్(తైక్వాండో)డాక్టర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

భూమికి సారం.. పచ్చిరొట్ట విత్తనం

ఏఓ శేషశయన



జీలుగ విత్తనాలు అందజేస్తున్న ఏఓ శేషశయన

వర్గల్(గజ్వేల్): భూసారం పెంచే జీలుగ విత్తనాలు యాభై శాతం రాయితీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి శేషశయన తెలిపారు. మండలంలోని అంబర్‌పేట 'హాకా' సేవా కేంద్రంలో జీలుగ విత్తన విక్రయాలను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూసారం పెంపు, నత్రజని స్థిరీకరణకు, దిగుబడి పెంపునకు జీలుగ, జనుము లాంటి పచ్చిరొట్ట ఎరువులు ఎంతో దోహదపడతాయన్నారు. ఈ విత్తనాలను ప్రభుత్వం 50 శాతం రాయితీపై రైతులకు అందజేస్తుందని చెప్పారు. రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో సాగుచేసేందుకు 30 కిలోల విత్తనాలు(బస్తా) సరిపోతాయని, వాటి ద్వారా 10 టన్నుల పచ్చిరొట్ట ఎరువు లభ్యమవుతుందని తెలిపారు. భూమికి 60 కిలోల నత్రజని, 15 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ సమకూరుతుందని వివరించారు. 30 కిలోల జీలుగ విత్తనాల బస్తాకు రూ.2137.50 చెల్లించి రైతులు కొనుగోలు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో రైతులు నర్సింహారెడ్డి, సదానందరెడ్డి, లక్ష్మారెడ్డి, ఏఈఓ భారతి తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ములుగు(గజ్వేల్): ప్రభుత్వం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి వసంతరావు సూచించారు. మండలంలోని వంటిమామిడి ఆగ్రోస్ రైతుసేవా కేంద్రంలో యాభై శాతం సబ్సిడీపై రైతులకు జీలుగు విత్తనాల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 50 క్వింటాళ్ల జీలుగు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీనివాస్, ఏఈఓ పధ్వి తదితరులు పాల్గొన్నారు.

సహజ ఎరువులతో అధిక దిగుబడి

దుబ్బాకటౌన్: సహజ ఎరువులతో భూ సారం వృద్ధిచెంది అధిక దిగుబడి పొందవచ్చని ఏడీఏ బాబునాయక్ అన్నారు. రాయపోల్‌లో ఆగ్రోస్ రైతుసేవ కేంద్రంలో రైతులకు జీలుగ, జనుము విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నరేశ్, ఏఈఓ ప్రవీణ్, బాగిరెడ్డి, అంజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు



మద్దూరు(హుస్నాబాద్): రికార్డులు పరిశీలిస్తున్న ఎస్‌ఐ షేక్ మహబూబ్, ఏఓ రామకృష్ణ



కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లిలో రికార్డులు పరిశీలిస్తున్న వెంకట్రావమ్మ, ఎస్‌ఐ రాజు

మద్దూరు(హుస్నాబాద్): నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ షేక్ మహబూబ్, ఏఓ రామకృష్ణ హెచ్చరించారు. మండలంలోని ఎరువుల దుకాణాలను సోమవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన విత్తనాలను మాత్రమే రైతులు కొనుగోలు చేయాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు తప్పకుండా రసీదు తీసుకుని భద్రపర్చుకోవాలని సూచించారు. దుకాణదారులు స్టాక్‌కు చెందిన రికార్డులు, బిల్లు పుస్తకాలను తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమించొద్దు

తొగుట(దుబ్బాక): నిబంధనలు అతిక్రమించి విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి మోహన్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పలు విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఎస్‌ఐ రవికాంత్‌రావుతో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలన్నారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు తప్పనిసరిగా రసీదులు ఇవ్వాలని, నకిలీ విత్తనాలు అంటగడితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విడి విత్తనాలను కొనుగోలు చేయొద్దు

కొమురవెల్లి(సిద్దిపేట): వ్యవసాయ అధికారులు సూచించిన విత్తనాలనే రైతులు కొనుగోలు చేయాలని, విడి విత్తనాలను కొనుగోలు చేయొద్దని మండల వ్యవసాయ అధికారి వెంకట్రావమ్మ సూచించారు. ఎస్‌ఐ రాజుతో కలసి మండల కేంద్రంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. విత్తనాలు, పురుగు మందులను పరిశీలించారు. నకిలీ, కాలం చెల్లిన మందులు, విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే 100కు డయల్ చేయాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు



దుంపలపల్లిలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ ప్రభుదాస్, పాధ్యాయులు



తిగుల్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

దుబ్బాకటౌన్: ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందిస్తున్నామని, పదో తరగతి ఫలితాలే అందుకు నిదర్శనమని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని లచ్చపేట, దుంపలపల్లిలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అనంతరం లచ్చపేటలో చిన్నారుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన బోధన, విద్యార్థులకు అందిస్తున్న ఉచిత సేవల గురించి వివరించారు. తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యా సంస్థలను నమ్మి అధిక భారం వేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేశ్, జ్యోతి, ప్రియ, మమత తదితరులున్నారు.

బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి

జగదేవ్‌పూర్(గజ్వేల్): బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అనసూయ కోరారు. మండలంలోని తిగుల్ గ్రామంలో సోమవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో ఉన్న బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీఏసీఎస్ డైరెక్టర్ భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

రామేశ్వరంపల్లిలో..

దుబ్బాకరూరల్: అక్బర్‌పేటభూంపల్లి మండలం రామేశ్వరంపల్లి ప్రభుత్వ పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండల విద్యాధికారి అంజయ్య పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించడం వల్ల ఫీజుల భారం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఇస్మాయిల్, రాజేశం, శ్రీనివాస్, మల్లేశం, పరశురాం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అనవసరపు ఆరోపణలు మానుకోండి

ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

దుబ్బాక: చౌదర్‌పల్లిలో తప్పుడు జీఓలతో భూములు రిజిస్ట్రేషన్ చేయించినట్లు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు తనపై కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చేస్తున్న అనవసరపు ఆరోపణలు మానుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చౌదర్‌పల్లిలో అన్యాక్రాంతమైన భూములకు చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులు కమిషన్‌కు ఫిర్యాదు చేస్తే కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరిపించి న్యాయం చేస్తామన్నారు. బాధితులకు అన్యాయం జరిగితే శ్రీనివాస్‌రెడ్డి సీఎం దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేయడానికి ప్రయత్నించాలని, అంతేకాని లేనిపోని ఆరోపణలు చేయవద్దని హితవుపలికారు. తమపై చేసిన ఆరోపణలు రుజువు చేయాలని, లేకుంటే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఆ భూముల వ్యవహారంలో అసలు విషయాలు దాచి అనవసరంగా ఆరోపణలు చేయడం సరైంది కాదని చెప్పారు.

కాటేజీ నిర్మాణానికి రూ.15 లక్షలు అందజేత



ఈఓకు చెక్కు అందజేస్తున్న దాత బద్రీనాథ్

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయంలో 100 కాటేజీల భవన నిర్మాణానికి గాను హైదరాబాద్‌కు చెందిన దాత చిర్రబోయిన బద్రీనాథ్‌యాదవ్ రూ.15 లక్షల చెక్కును ఆలయ ఈఓ అన్నపూర్ణకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాటేజీల నిర్మాణానికి మరింత మంది భక్తులు, దాతలు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, అర్చకులు మనోహర్, సూర్య, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.